# ఎన్ఆర్ఐలో అరుదైన శస్త్రచికిత్స



ప్రసంగిస్తున్న డాక్టర్ సుమన్, పక్కన డాక్టర్ శ్రీనివాస్

మంగళగిరి/విజయవాడ, న్యూస్‌లైన్: మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో రాష్ట్రంలోనే తొలిసారిగా అరుదైన జాయింట్ రీప్లేస్‌మెంట్ రివిజన్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ పెండ్యాల సుమన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన శస్త్రచికిత్స వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా తుమ్మపూడి గ్రామానికి చెందిన సూర్యదేవర లలితాంబ(72)కు పదేళ్ల క్రితం రెండు మోకాళ్లకు హైదరాబాద్‌లో ఆపరేషన్ చేసి కృత్రిమ కీళ్లు అమర్చారని తెలిపారు. ఇటీవల ఇన్‌ఫెక్షన్ సోకి ఒక మోకాలు బాగా దెబ్బతిన్నదని, దాంతో పాటు చుట్టూ ఎముక కూడా పాడైపోయిందని చెప్పారు. ఈ పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చిన లలితాంబకు రెండు నెలల క్రితం ఆపరేషన్ చేసి కృత్రిమ కీలు తొలగించి, అమెరికా నుంచి తీసుకొచ్చిన యాంటీ బయోటిక్ స్పేసర్ అమర్చినట్లు సుమన్ తెలిపారు. ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గాక ఇటీవల మళ్లీ ఆపరేషన్ చేసి కొత్త జాయింట్‌తో పాటు దెబ్బతిన్న ఎముక భాగంలో బోన్ సిమెంట్‌తో ఖాళీలను పూడ్చి, అమెరికా నుంచి తీసుకొచ్చిన ఎంబీటీ, టీసీజీ రివిజన్ ఇంప్లాంట్లను అమర్చామని చెప్పారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించడానికి అనస్థీషియా నిపుణులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పంచాక్షరి, ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ రాజేష్ సహకరించినట్లు తెలిపారు.